# కడుపు మంట కథ

అది బస్సు స్టాపు. సిటీ బస్సులకోసం ఎదురుచూస్తూ అక్కడ చాలామంది ఉన్నారు. ఓ పక్కగా లత నిలబడి ఉంది. ఆమె వంక ఆకలిగా చూస్తున్నాడు విశ్వనాథం. తను ప్రేమిస్తున్న అమ్మాయివంక అలా ఆకలి చూపులు చూస్తున్న విశ్వనాథాన్ని చూస్తున్నకొద్దీ కడుపు మండిపోతూంది శంకర్రావుకి.

సుబ్బారావు కడుపు మండిపోతూంది! సుశీల...తన భార్య సుశీల!...మెడలోతనతో లైసెన్సు బిళ్ళలు కట్టించుకున్న సుశీల...తన సొత్తు...తను పక్కన ఉండగానే వేరే వాడివైపు అలా గుడ్లప్పజెప్పి చూస్తుందా?...

"ఆ ప్రక్కగా నిలబడదాం పద" అంటూ సుశీలను అటు ప్రక్కకి తీసుకెళ్ళాడు సుబ్బారావు

జోగినాథానికి క్రితంరోజు జరిగిన సంఘటన తలుచుకుంటుంటే కడుపుమండిపోతుంది. ఆఫీసులో క్రితంరోజు తనచేత ఆ కాంట్రాక్టరు పనిచేయించుకని అయిదువేలిస్తానని అన్నవాడు పని అయిన తరువాత మూడువేలే ఇచ్చి, మిగతాది తరువాత ఇస్తానని అన్నాడు. హు...పని అయిపోయిన తరువాత మళ్ళీ పనిగట్టుకుని తనకు మొహం చూపిస్తాడా ఆ రెండువేలు ఇవ్వడానికి?...ప్చ్...రెండు వేలు నష్టం!...

"అసలు అందరికంటే సీనియర్‌ని నేనేనండీ...కానీ ఆ వెధవాయ్‌కు ప్రమోషను వచ్చింది!...ఎందుకంటారూ?... వాడు ఆఫీసరుకు చెంచా అండీ బాబూ..." అంటూ తన కడుపుమంటను సహోద్యోగులకు చెప్పుకున్నాడు చలపతి.

"కైలాసం అంత పెద్ద బిల్డింగ్ కట్టాడంటే డబ్బు చాలా ఉండి ఉండాలి...కారుకూడా కొందామని అనుకుంటున్నాడు ...కొనడూ మరి? సీటు మహాత్యం"

పొరుగువాడి పచ్చ చూడలేని పిచ్చయ్య కడుపుమంట అది.

బస్సు స్టాపులో ఒక ప్రక్కగా ఉన్న మిరపకాయ బజ్జీల బండిదగ్గర గోపాల్రావ్ నిలబడి బజ్జీలు తింటున్నాడు.

"అబ్బ...బజ్జీలు చాలా కారంగా ఉన్నాయి. మిరప కాయల్లో మసాలా పెట్టలేదా?...కడుపు మండిపోతుంది" అని బండివాడితో అంటూ బజ్జీలు సగం సగం తిని, సగం సగం పారేస్తున్నాడు గోపాల్రావ్.

గోపాల్రావ్ అలా సగం సగం తిని బజ్జీలు చెత్తమీద పారేయడం చూస్తుంటే ఆపక్కనే ఫుట్‌పాత్‌మీద కూర్చున్న రంగడికి కడుపుమండిపోయింది.

అవునుమరి!...పాపం వాడికి రెండ్రోజులనుండి తిండి లేదు.

జనవరి, 1981 జ్యోతి